సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



శ్రీవారి దీక్ష.. సర్వ జగద్రక్ష

చినవెంకన్న దివ్య క్షేత్రంలో పెద్ద ఎత్తున భక్తులు గోవింద మాలను స్వీకరించారు. గోవింద స్వాములతో శ్రీవారి క్షేత్రం కళకళలాడింది. 8లో ▸



కార్గో సేవల ఆదరణకు చర్యలు

ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో ఆదరణ పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 20 నుంచి డోర్ డెలివరీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. 8లో ▸



అరకొర వైద్యం

భీమవరంలోని ప్రభుత్వాస్పత్రిలో అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. పూర్తిస్థాయిలో వైద్య నిపుణులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

అధినేతను కలిసిన వడ్డి



పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో రైతుల కష్టాల గురించి అధినేతతో చర్చించినట్టు రఘురాం చెప్పారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని అధినేత సూచించారన్నారు.

21న పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

భీమవరం (ప్రకాశంచౌక్): గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికకు ఈనెల 21న ఎన్నికలను నిర్వహించేందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో కమిటీకి సంబంధించి ఒక అధ్యక్ష, ఒక ఉపాధ్యక్ష పదవులకు అభ్యర్థులను ఎంపికచేస్తామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి 14 డీసీలు, తూర్పుగోదావరి జిల్లా నుంచి 2 డీసీలు, ఏలూరు జిల్లా నుంచి 4 డీసీలు మొత్తం 20 నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో డెల్టా ప్రాజెక్ట్ కమిటీని ఎన్నుకుంటామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టడంతో పాటు మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత కట్టుదిట్టం చేయాలన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై ఆగ్రహం



భీమవరంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బలరామ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కేవీపీఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన సభ నిర్వహించారు. బలరామ్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు దారుణమన్నారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు తదితరులు పాల్గొన్నారు.

బర్తరఫ్ చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

భౌగోళిక గుర్తింపునకు కృషి

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటలకు భౌగోళిక గుర్తింపు తీసుకురావడానికి వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ కృషి చేస్తోందని వక్తలు అన్నారు. వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన పంటల భౌగోళిక గుర్తింపు, విధానాలు, ప్రక్రియలు అనే అంశంపై గురువారం ఆన్‌లైన్‌లో కార్యక్ర మం నిర్వహించారు. ఐపీ ఆర్ రిసెల్యూట్ హెడ్ సుభజిత్ సాహా, వీసీ కె.గోపాల్, పరిశోధన సంచాలకులు ఎం.మాధవి తదితరులు మాట్లాడారు.

పేదలపై ఫీజుల భారం

ఉండి ఎస్‌ఆర్‌పీ అగ్రహారానికి చెందిన రాజా తన కుమారుడిని ఉండిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సెక్షన్ 12 (1)సీ కింద గతేడాదిలో 1వ తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం 2వ తరగతిలోకి రాగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని ఈ ఏడాది ఫీజు మొత్తం రూ.28 వేలు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి తీసుకురావడంతో అప్పు చేసి టర్మ్‌ల వారీగా ఫీజు చెల్లిస్తున్నారు.

తణుకుకు చెందిన పి.వెంకటేశ్వరరావు విద్యాహక్కు చట్టంలో ఉచిత ప్రవేశం కింద తన కుమార్తెను పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలో 1వ తరగతిలో చేర్పించారు. ఇప్పటివరకు ఫీజు ఊసెత్తని స్కూల్ యాజమాన్యం మొదటి రెండు టర్మ్‌లతో కలిపి ఫీజు మొత్తం రూ.27,000 చెల్లించాలని రెండు రోజుల క్రితం నోటీసు అందించడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదంటున్నారు.

కూటమి వాత.. ప్రజల వ్యథ

- ఉచిత 'కార్పొరేట్' విద్యకు మంగళం!
- ఉచిత ప్రవేశాలు పొందినా ఫీజులు చెల్లించాల్సిందే..
- పాఠశాలల యాజమాన్యాల ఒత్తిడి
- విద్యాహక్కు చట్టానికి తూట్లు
- ఉచిత ప్రైవేట్ విద్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు
- 1వ తరగతిలో ప్రవేశాలకు 25 శాతం సీట్ల కేటాయింపు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



సాక్షి, భీమవరం : నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు అన్నారు.. తల్లికి వందనంగా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామంటూ ఎడాపెడా ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా పేదలపై ఫీజుల భారం మోపారు. పైసా ఖర్చులేకుండా పేదల పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో విద్యనందించాలన్న ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. విద్యారంగానికి పెద్దపీట వేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలపై ఫీజుల భారం పడకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే వీలు కల్పించారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్-12(1),(సి)ను అనుసరించి ప్రైవేట్ విద్యాసంస్థల్లోని 1వ తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థుల కోసం కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లు నిండి ఆరేళ్లలోపు పిల్లలకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తూ అందుకు అర్హతగా విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.14 లక్షలలోపు ఉండాలని నిర్ణయించారు. ఈ మేరకు స్కూల్ యాజమాన్యాలకు ఏడాదికి అర్బన్ ఏరియాలో రూ.8,000, రూరల్‌లో రూ.6,500, ఏజెన్సీ ప్రాంతంలో రూ.5,500 ఫీజుగా నిర్ణయించారు. అయితే విద్యార్థి తల్లిదండ్రులు చెల్లించలేని పక్షంలో వారికందించే అమ్మఒడి సాయం నుంచి ఈ మేరకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఫీజు పోను మిగిలిన సొమ్మును విద్యార్థి తల్లి ఖాతాకు జమచేసేలా చర్యలు తీసుకుంది.

జిల్లాలోని 383 పాఠశాలల్లో..

జిల్లాలో 383 ప్రైవేట్ పాఠశాలలకుగాను 1వ తరగతిలోని వాటి సీట్ల సంఖ్యలో 25 శాతం ప్రభుత్వం కల్పించే ఉచిత విద్యకు కేటాయించాల్సి ఉంది. ఈ విధానాన్ని 2022-23 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురాగా తొలి ఏడాది వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 38 మంది విద్యార్థులు చేరారు. గత విద్యాసంవత్సరంలో అనూహ్యంగా 1,812 దరఖాస్తులు రాగా అర్హత కలిగిన 1,162కి ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య పొందే అవకాశం కల్పించారు.

ఈ ఏడాదిలో 1,326 మంది..

మొదటి ఏడాది చేరిన విద్యార్థులు ఈ విద్యాసంవత్సరంలో 3వ తరగతిలోకి రాగా, గతేడాది చేరిన వారు రెండో తరగతిలోకి వచ్చారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 2,000కు పైగా దరఖాస్తులు రాగా అర్హత కలిగిన దాదాపు 1,326 మంది విద్యార్థులు 1వ తరగతిలో చేరారు. గత ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా అమ్మఒడి సాయాన్ని విడుదల చేయడం వలన ఆ మొత్తం నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలకు కనీస ఫీజు ఇచ్చేందుకు పేదలకు ఇబ్బంది ఉండేది కాదు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది.


[redacted] SCHOOL : TANUKU
NOTICE
Name of the Student [redacted]
NATURE OF FEES
Old Dues
Term Fee
Bus / Auto
Total
NOTE
TIMINGS
[redacted]
DIRECTOR

ఫీజు మొత్తం చెల్లించమంటూ తణుకులోని ఓ విద్యాసంస్థ ఇచ్చిన నోటీసు

పథకాలు రాక.. ఫీజులు కట్టలేక..

ఎంతమంది ఉంటే అందరు పిల్లలకు రూ.15 వేల చొప్పున ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లికి వందనం ఊసెత్తడం లేదు. సంక్షేమ పథకాల అమలు చేయడం లేదు. తల్లిదండ్రులు చెల్లించకుంటే గతంలో మాదిరి ప్రభుత్వం చెల్లిస్తుందన్న భరోసా కూడా ఇవ్వడం లేదు. సెక్షన్-12(1), (సి)కి వ్యతిరేకంగా ప్రైవేట్ విద్యాసంస్థలు కోర్టును ఆశ్రయించగా పేదలు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చొరవ చూపడం లేదు. దీంతో విద్యాసంస్థలు ఫీజుల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఫీజు మొత్తం చెల్లించాలని నోటీసులు ఇస్తున్నాయి. ఇప్పటికే నిర్ణీత ఫీజు చెల్లించిన వారికి మిగిలిన ఫీజు చెల్లించాలని, లేని వారిని మొత్తం ఫీజు చెల్లించాలని చెబుతున్నాయి. ఉచిత విద్య అందుతుందని ఆశతో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన పేదవర్గాల వారు తమ బిడ్డల భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

మా దృష్టికి రాలేదు



ఫీజుల కోసం ప్రైవేట్ విద్యాసంస్థలు ఒత్తిడి చేస్తున్నట్టు ఎక్కడా మా దృష్టికి రాలేదు. అటువంటి సంఘటనలు ఎక్కడా కూడా జరగడం లేదు. ఏమైనా మా దృష్టికి తెస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకుంటాం.

– ఈవీవీఎస్‌ఎస్‌ఎస్ నారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి, భీమవరం

ప్రాథమిక విద్య కీలకం

కలెక్టర్ నాగరాణి



పాందువ్వలో బాలికల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు పటిష్టంగా ఉంటే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గురువారం మండలంలోని పాందువ్వ, ఉండిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారికి మరింత శ్రద్ధగా విద్యాబోధన చేయాలన్నారు. టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల ప్రణాళికలను పక్కాగా అమలు చేయాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆమె పరిశీలించారు. పాందువ్వలో డ్రైయినేజీ సమస్యపై స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పాందువ్వలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. రైతుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఈఓ ఈ.నారాయణ, తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, ఎంపీటీసీ సాగిరాజు సుజాత పాల్గొన్నారు.

గోకులం షెడ్లపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): గోకులం పశువుల షెడ్ల నిర్మాణాల లక్ష్యంలో వెనుకబడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతి, అంగన్‌వాడీ పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మిస్సింగ్ హౌస్ డేటా ఎన్‌రోల్‌మెంట్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ నమోదు అంశాలపై ఆమె సమీక్షించారు.

అందుబాటులోకి హెచ్‌ఐవీ కిట్లు

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'వేధిస్తున్న హెచ్‌ఐవీ కిట్ల కొరత' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈనెలలో మూడో కిట్ కొరత ఏర్పడిందని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 14 ఐసీటీసీ సెంటర్లలో ప్రస్తుతం మూడో కిట్‌లు 50 వరకు అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి కిట్ల కోసం ఇండెంట్ పెట్టామని శుక్రవారం నాటికి అందుబాటులోకి వస్తాయని డీఎంహెచ్‌ఓ చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు. చిత్రంలో పార్లమెంట్ సమన్వయకర్త ఉమాబాల

భీమవరం: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా జిల్లా నాయకులంతా అండగా ఉంటామని, అధైరపడొద్దని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని రాయలం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 86 శాతం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే అధికారంలో ఉన్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం అలుపెరుగని పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ పునర్నిర్మాణానికి సమష్టి నిర్ణయాలు తీసుకునేలా పార్టీ అధినేత జగన్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 15 మంది నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటుచేసి కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు నిర్ణ యాలు తీసుకుంటామన్నారు. పార్టీ నుంచి కొందరు నాయకులు బయటకు వెళ్లారు తప్ప.. కార్యకర్తలు, ఓటర్లు పార్టీకి అండగానే ఉన్నారని స్పష్టం చేశారు. కూటమి పాలనపై ఆరు నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యిందన్నారు. విద్యుత్ చార్జీలను పెంచారని, రైతు భరోసా, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలు అటకెక్కించారన్నారు. ప్రజలకు అండగా నిలిచేందుకు ఈనెల 27న విద్యుత్ చార్జీల పెంపుపై, జనవరి 3న విద్యార్థుల సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ గూడూరి ఉమాబాల మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తారన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పదవుల కంటే గౌరవం కోసం ఆరాటపడతారని దీనిని పార్టీ గుర్తించిందన్నారు. వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజల్లోకి తీసుకువెళదామన్నారు.

భీమవరం మండల అధ్యక్షుడిగా కొండయ్య

భీమవరం మండల పార్టీ అధ్యక్షుడిగా కొత్తపూసలమర్రు సర్పంచ్ జల్లా కొండయ్యను ఎంపిక చేసినట్టు ప్రసాదరాజు ప్రకటించారు. మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, నాయకులు కామన నాగేశ్వరరావు, బంధన పూర్ణచంద్రరావు, కోడి విజయలక్ష్మి, తిరుమాని ధనుంజయ, గాదిరాజు రామరాజు, బోకూరి విజయరాజు, రవికుమార్‌రాజు, పెనుమాల నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు!

ప్రభుత్వం పోటు

- భూములు, నిర్మాణాల విలువ పెంపునకు ప్రతిపాదనలు
- సగటున 10 నుంచి 25 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగే అవకాశం
- మార్కెట్‌లో మందగించిన ఆర్థిక లావాదేవీలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు
- ఈ నిర్ణయంతో మరో ఎదురుదెబ్బ
- మార్కెట్ రేట్లకు సమానంగా రిజిస్ట్రేషన్ విలువలు



ఏలూరులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏలూరు జిల్లా	
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	12
రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యం (2024-25)	రూ. 309.65 కోట్లు
ఇప్పటివరకు వచ్చిన ఆదాయం	రూ.214.43 కోట్లు
పూర్తయిన లక్ష్యం	69.25 శాతం
రిజిస్ట్రేషన్ల సంఖ్య	72,268

పశ్చిమగోదావరి జిల్లా	
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	15
రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యం (2024-25)	రూ.447.15 కోట్లు
ఇప్పటివరకు వచ్చిన ఆదాయం	రూ.260.92 కోట్లు
పూర్తయిన లక్ష్యం	58.35 శాతం
రిజిస్ట్రేషన్ల సంఖ్య	68,181

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తాడేపల్లిగూడెంలోని యాగర్ల పల్లిలో చదరపు గజం ప్రభుత్వ విలువ రూ.10 వేలు.. బహిరంగ మార్కెట్‌లో రూ.6 వేలు.. ఇకపై ప్రభుత్వ విలువ రూ.12 వేల వరకు పెరుగనుంది.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఒక్క రూపాయి కూడా పెరగడం లేదు.. ఇదే పరిస్థితి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. ఇప్పటికే జిల్లాలో తీవ్ర సంక్షోభంలో ఉన్న రియల్ ఎస్టేట్ రంగంపై మరో 'పోటు' పడనుంది. భూ విలువలు సవరణకు ప్రతిపాదనలు ఖరారు చేసి సగటున 10 శాతం నుంచి 25 శాతం వరకు రేట్లనకు పెంపునకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శుక్ర వారం నుంచి పెంపు ప్రతిపాదనలను సబ్ రిజిస్ట్రా ర్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈనెల 24లోపు రాత పూర్వకంగా అభ్యంతరాలు స్వీకరించి, 27న తుది ప్రతిపాదనలు ఖరారు చేసి జనవరి 1వ తేది నుంచి అమల్లోకి తీసుకురానున్నారు.

రియల్‌పై మరో పిడుగు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలైంది. ప్రధానంగా ఏడు నెలల నుంచి ఓపెన్ ప్లాట్లు నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, వీటితో పాటు కొన్ని ప్రాంతాల్లో పొలాలు ధరలు తిరోగమన బాటపట్టినా కాని కొనుగోలుదారులు ముందుకు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి పశ్చిమలో ధరలు బాగా పెరుగుతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు హడావుడి చేశారు. కట్‌చేస్తే.. స్థానికంగా రియల్ మార్కెట్‌పై ప్రజల్లో ఆసక్తి పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఏలూరు జిల్లా పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రధానంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లులో రియల్ మార్కెట్ రెండేళ్ల క్రితం వరకు ఆశాజనకంగా సాగింది. ఈ ఏడాదిలో మొత్తంగా 140,449 రిజిస్ట్రేషన్లు జరగ్గా 50 శాతానికిపైగా తనఖా, గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లు కావడమే గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు మరింత ఇబ్బందికరంగా మారనుంది.

పెంపు ప్రతిపాదనలు ఇలా..

ఏలూరు జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అర్బన్, రూరల్‌గా విభజించి ధరలు పెంచారు. భీమడోలు అర్బన్, రూరల్‌లో 15 శాతం, చింతలపూడి అర్బన్, రూరల్‌లో 10 నుంచి 15 శాతం, జంగారెడ్డిగూడెం అర్బన్, రూరల్‌లో 15 శాతం, పోలవరం అర్బన్‌లో 10 నుంచి 20 శాతం, రూరల్‌లో 10 నుంచి 25 శాతం పెంచారు. కామవరపుకోట అర్బన్‌లో 10 నుంచి 20 శాతం, రూరల్‌లో 10 నుంచి 25 శాతం, వట్లూరు అర్బన్, రూరల్‌లో 15 శాతం, ఏలూరు అర్బన్‌లో 10 శాతం, రూరల్‌లో 10 నుంచి 15 శాతం, గణపవరం అర్బన్, రూరల్‌లో 10 నుంచి 15 శాతం, కైకలూరు అర్బన్‌లో 10 నుంచి 20 శాతం, రూరల్‌లో 10 నుంచి 25 శాతం, మండవల్లి, నూజివీడు, ముదినేపల్లి అర్బన్, రూరల్‌లో 10 నుంచి 20 శాతం పెంపుదలను ఆమోదించారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో కార్యాలయాల్లో ధరల పెంపునకు సంబంధించి జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలను పరిగణనలోనికి తీసుకుని సర్వే నంబర్ల ఆధారంగా విలువ పెంపు నిర్ధారించాలని సూచించి మూడు రోజుల్లోగా ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఇక్కడ కూడా సగటున 10 నుంచి 25 శాతం పెంపు ప్రతిపాదనలను ప్రాథమికంగా ఆమోదించారు.

హేతుబద్ధంగా విలువల పెంపు



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సర్వే నంబర్ల వారీగా పరిశీలించి హేతుబద్ధంగా మార్కెట్ విలువ పెంపుదలకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని అన్ని వార్డులు, బ్లాకులు, సర్వే నంబర్ల వారీగా పరిశీలన చేయాలన్నారు. ఈసీ డేటా తీసుకొని నిర్ధారించాలన్నారు. కొత్తగా వచ్చిన డోర్ నంబర్లు సేకరించాలన్నారు. సరిహద్దు గ్రామాల మధ్య సర్వే నంబర్లు వేర్వేరుగా ఉంటే ఒకేలా విలువకు తీసుకురావాలన్నారు. ప్రజల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఇతర నివాస స్థలాలను వేర్వేరుగా గుర్తించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు తయారుచేసి అందజేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డీఐజీ ఎస్.మాధవి, జిల్లా రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ ఎం.పార్వతి, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్ది హుండీ ఆదాయం రూ.45.64 లక్షలు



మద్ది ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. తాడేపల్లిగూడెం దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు సీహెచ్ ఉదయ్‌కుమార్ బాబు, లక్కవరం ఏఎస్సై భాస్కర్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. కేవీబీ బ్యాంక్ సిబ్బంది సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించగా, 51 రోజులకు గాను దేవాలయ హుండీల ద్వారా రూ.43,77,549, అన్నదానం హుండీ ద్వారా రూ.1,87,021, వెరశి మొత్తం ఆదాయం రూ.45,64,570 వచ్చినట్లు ఈవో, ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

చింతలపూడి: చింతలపూడి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రేగుల శ్రీనివాసరావు (17) చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురువారం ఉదయం స్థానికులు శ్రీనివాసరావు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే శ్రీనివాసరావు బుధవారం రాత్రి సమీపంలోని తోటలో చెట్టుకి ఉరేసుకుని చనిపోయినట్లు భావిస్తున్నారు.

కల్తీ పెట్రోల్ విక్రయాలు ఆపాలని ఆందోళన

పెట్రోల్ బంక్ సిబ్బందిపై వాహనచోదకుల ఆగ్రహం



పెట్రోల్ బంక్ వద్ద సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

బుట్టాయగూడెం: కల్తీ పెట్రోల్ విక్రయాలు ఆపాలంటూ గురువారం ద్విచక్ర వాహనచోదకులు బుట్టాయగూడెం శివాలయం సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆందోళనకు దిగారు. గత కొద్దిరోజులుగా అనేకమంది వాహనదారులు ఇక్కడ కొట్టిస్తున్న పెట్రోల్ కారణంగా తమ వాహనాలు పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ పెట్రోల్ విక్రయాలు ఆపాలని, తమకు జరిగిన నష్టంపై సమాధానం చెప్పాలని పెట్రోల్ బంక్ సిబ్బందిని నిలదీశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే కల్తీ పెట్రోల్ విక్రయాలు నిలిపి వేయాలని వాహనదారులు పట్టుపట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు పెట్రోల్ శాంపిల్స్‌ను తీసుకుని పరీక్షలకు పంపించారు. పరీక్షల రిపోర్టు వచ్చేవరకూ విక్రయాలు నిలిపివేశారు. ఇక్కడ పెట్రోల్ వినియోగించిన సుమారు 50 వాహనాల వరకూ పాడైపోయినట్లు వాహనదారులు తెలిపారు.

కార్గో సేవల ఆదరణకు చర్యలు

- పట్టణాల్లో నేటి నుంచి డోర్ డెలివరీ సేవలు
- నెలరోజుల పాటు స్పెషల్ డ్రైవ్
- ఇకపై డిక్కీ బుకింగ్‌లకు అవకాశం



ఆర్టీసీ కార్గో సర్వీసు వాహనం

నూజివీడు: ప్రజా రవాణా సంస్థ(ఆర్టీసీ) అందిస్తున్న కార్గో సేవలపై ప్రజల్లో ఆదరణ పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కార్గో సర్వీసుల ద్వారా మరింత ఆదాయం పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆంధ్ర ప్రగతి రథ చక్రం ప్రజా రవాణా సంస్థను బలోపేతం చేసేందుకు అనేక విప్లవాత్మకమైన విధానాలను అమలులోకి తీసుకువచ్చింది. సంస్థకు వచ్చిన నష్టాలను తగ్గించుకోవడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా కొరియర్, కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అంతేగాకుండా మరింత ఆదాయం పొందడంలో భాగంగా కార్గో రవాణాను నగరాల్లో డోర్ డెలివరీ సదుపాయాన్ని సైతం ప్రవేశపెట్టింది. దీంతో ఏడాదికేడాదికి కార్గో సేవల ద్వారా ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణాల్లో సైతం డోర్ డెలివరీని అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

జనవరి 19 వరకు స్పెషల్ డ్రైవ్

ఇప్పటివరకు తమకు వచ్చిన పార్శిళ్లను తీసుకెళ్లాలంటే బస్టాండ్‌లోని కొరియర్ పాయింట్‌కు వచ్చి వాటిని తీసుకెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ డిపోలు ఉన్న దగ్గర కార్గో సర్వీసు ద్వారా వచ్చిన పార్శిళ్లు, కొరియర్ కవర్లను పది కిలోమీటర్ల వరకు ఉచితంగా డోర్ డెలివరీ చేస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంత ప్రజల్లో దీనిపై పెద్దగా అవగాహన లేకపోవడంతో మరింత అవగాహన పెంచేందుకు గాను ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు డోర్ డెలివరీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆర్టీసీ నిర్వహించనుంది. దీనికి తోడు డిక్కీ బుకింగ్ సేవలను కూడా అందుబాటులోకి తెస్తోంది. దూర ప్రాంతాలకు జామకాయలు, పూలు, కూరగాయలు తదితర వాటితో పాటు సామగ్రిని సైతం రవాణా చేసేందుకు డిక్కీ సేవలను ఉపయోగించుకోవచ్చు.

ఆదాయం పెరుగుదలలో భీమవరం ఫస్ట్

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు డిపోలున్నాయి. ఏలూరు జిల్లాలో నూజివీడు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నర్సాపురంలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలోని మూడు డిపోల నుంచి ఇప్పటి వరకు రూ.2.60 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు డిపోల నుంచి రూ.4.45 కోట్లు ఆదాయం వచ్చింది. ఆదాయం పెరుగదలలో భీమవరం డిపో ముందంజలో నిలిచింది.

2024 ఏప్రిల్ నుంచి ఈనెల 16 వరకు డిపోల వారీగా వచ్చిన కార్గో ఆదాయ వివరాలు

డిపో	కార్గో ఆదాయం
నూజివీడు	రూ.40 లక్షలు
ఏలూరు	రూ.1.45 కోట్లు
జంగారెడ్డిగూడెం	రూ.76 లక్షలు
భీమవరం	రూ.1.17 కోట్లు
తాడేపల్లిగూడెం	రూ.1.43 కోట్లు
తణుకు	రూ.1.04 కోట్లు
నర్సాపురం	రూ.81 లక్షలు

కార్గో ఆదాయం పెంచేందుకు కృషి



ఆర్టీసీలో కార్గో ఆదాయం పెంచేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈనెల 20 నుంచి వచ్చే నెల 19 వరకు కార్గో హోం డెలివరీ ప్రత్యేక డ్రైవ్ మాసోత్సవాలను నిర్వహించనున్నాం. కార్గో ఏజెంట్లను సైతం నియమించి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డిక్కీ బుకింగ్‌లకు సైతం అవకాశం కల్పిస్తున్నాం.

– జీ లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు, కార్గో మేనేజర్

అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల మధ్య మహిళల వాలీబాల్ పోటీలు స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీఆర్‌ఆర్ విద్యా సంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ విశ్వనాథరావు ప్రారంభించారు. యూనివర్సిటీ పరిధిలోని 12 కళాశాలల నుంచి మొత్తం 140 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచన విద్యార్థినులను ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయనున్నారు. శుక్రవారం జరిగే యూనివర్సిటీ జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా ఏ. స్వాతి, జీవీ పవన్ కుమార్ వ్యవహరిస్తుండగా జీ ప్రమీలా రాణి పరిశీలకురాలిగా, పీ సునీతమ్మ, కే సంజీవరావు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో సీఆర్‌ఆర్ మహిళా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీ సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కే ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

మెషీన్‌లో పడి వలస కూలీ మృతి



మినుము ఆడే మెషీన్‌లో ఇరుక్కున్న విష్ణు మృతదేహం



పాతుల విష్ణు (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ : పొట్ట చేతపట్టుకుని వచ్చిన వలస కార్మికుడు ప్రమాదవశాత్తు మినుము ఆడే మెషీన్‌లో పడి మృతి చెందిన ఘటన గురువారం తాడేపల్లిగూడెం మండలంలోని నీలాద్రిపురం పంచాయతీ పరిధి కృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా రాజాం మండలం రాజాం గ్రామం నేతల వీధికి చెందిన పాతుల విష్ణు (30) గత పది రోజుల క్రితం మరో ఆరుగురు కూలీలతో కలిసి తాడేపల్లిగూడెం మండలానికి మినుము ఆడే పనిపై వచ్చాడు. గురువారం ఉదయమే కృష్ణాపురం ఆయిల్‌పామ్ వెయింగ్ మెషిన్ సమీపంలోని పొలంలో మినుము ఆడుతుండగా బరకం మెషీన్‌లోకి లాగేయడంతో మెషీన్‌లో ఇరుక్కుని తల నుజ్జయింది. దీంతో విష్ణు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో మృతుని కుటుంబానికి న్యాయం చేసే వరకు మెషిన్‌లో నుంచి మృతదేహాన్ని తీసేది లేదంటూ సహచర కార్మికులు పట్టుబట్టారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులతో చర్చించారు. ఎట్టకేలకు విష్ణు మృతదేహాన్ని బయటకు తీసి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విష్ణుకి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



పీవీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు



పీతల రవికుమార్, ప్రధాన కార్యదర్శి

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పీవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పీతల రవి కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా తేలి సంజయ్ గాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రాంబాబు, కోశాధికారిగా పితాని హరిబాబులను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీజే ప్రభువరం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేపీ స్టీవెన్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుటలో తమ సంఘం ముందు వరుసలో ఉంటుందన్నారు.

వేటకు వెళ్లి.. మత్స్యకారుడు మృతి

యలమంచిలి: చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందాడని ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. దొడ్డిపట్ల గ్రామానికి చెందిన పొన్నాడి ఏసురాజుకు (35) చేపల వేట జీవనాధారం. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఆరు గంటలకు గోదావరిలో వేటకు వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు కాని ఎనిమిది గంటల సమయంలో అతడి మృతదేహం గోదావరి ఒడ్డుకు కొట్టుకువచ్చింది. ఏసురాజు మృతదేహాన్ని గుర్తుపట్టిన ఏడుకొండలు అనే వ్యక్తి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఏసురాజుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏసురాజు భార్య ధనలక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య చెప్పారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో గురుకుల విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న పెదవేగి గురుకుల యాజమాన్యం

పెదవేగి : రాష్ట్రస్థాయి అండర్ 19 ఎస్‌జీఎఫ్ బేస్ బాల్ టోర్నమెంట్‌లో పెదవేగి గురుకుల విద్యార్థులు సత్తా చాటి ద్వితీయ స్థానం సాధించారని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పెదవేగి విద్యార్థులు 9 మంది పాల్గొనగా నలుగురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 15 నుంచి మహారాష్ట్ర నాందేడ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీడీ జయరాజు, పీఈటీ గురుమూర్తిని పలువురు అభినందించారు.

దారి తగవు కేసులో ఆరుగురికి జైలు శిక్ష

ఉంగుటూరు: దారి తగవు విషయంలో నమోదైన కేసుకు సంబంధించి ఆరుగురికి తాడేపల్లిగూడెం సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణి జైలు శిక్ష విధించినట్లు గణపవరం సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. 2017వ సంవత్సరంలో పెద్ద వెల్లమిల్లి గ్రామంలో దారి తగవు విషయంపై గ్రామానికి చెందిన పిల్లం గోళ్ల భాస్కరరావు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదే గ్రామానికి చెందిన కుందేటి శ్రీను, కుందేటి వీరరాఘవులు, కుందేటి అబ్బులు, కుందేటి సరస్వతి, కుందేటి నాగమణి, కుందేటి బ్రహ్మయ్య అనే వారిపై అప్పటి ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి అన్నామణి కుందేటి శ్రీను, కుందేటి వీరరాఘవులు, కుందేటి సరస్వతి, కుందేటి నాగమణి, కుందేటి బ్రహ్మయ్యలకు సంవత్సరం మూడు నెలల చొప్పున జైలు, 20 వేలు జరిమానా విధించారు. అలాగే కుందేటి అబ్బులుకు సంవత్సరం ఆరు నెలలు జైలు, 30 వేలు జరిమానా విధించారు. ఈ కేసులో ఏపీపీ అడబాల రవి వాదనలు వినిపించగా, చేబ్రోలు ఎస్సై ఎం.సూర్యభగవాన్, కోర్టు కానిస్టేబుల్ బాలిన లక్ష్మీనారాయణ సహకరించారు.

శ్రీవారి దీక్ష.. సర్వ జగద్రక్ష

- ముక్కోటి ఏకాదశికి భక్తుల అర్ధ మండల దీక్షలు
- గోవింద స్వాములతో క్షేత్రం కళకళ
- జనవరి 10న ఇరుముడుల సమర్పణ



శ్రీవారి ఆలయంలో గోవింద స్వాములు



గోవిందుడి దీక్షను స్వీకరిస్తున్న భక్తుడు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో పెద్ద ఎత్తున భక్తులు గురువారం తెల్లవారుజామున గోవింద మాలను స్వీకరించారు. పెద్దలతో పాటు యువత, బాలలు సైతం ఈ అర్ధమండల దీక్షను చేపట్టారు. దీంతో గోవింద స్వాములతో శ్రీవారి క్షేత్రం కళకళలాడింది. ముందుగా ఆలయంలో దీక్షాధారుల మెడలో అర్చకులు మాలలను వేశారు. అనంతరం స్వాములు దీపారాధనలు చేసి, ప్రదక్షిణలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారి తొలి హారతిని అందుకున్నారు. ప్రతి ఏటా శ్రీవారి దీక్షను వందలాది మంది భక్తులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా ద్వారకాతిరుమల పరిసర ప్రాంతాలతో పాటు, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన భక్తులు అధికంగా ఈ దీక్షను చేపట్టారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, స్వామివారి ఉత్తరద్వార దర్శనం చేసుకున్న అనంతరం వీరంతా ఇరుముడులు సమర్పించి, దీక్షను విరమిస్తారు.

దీక్ష స్వీకరించేది ఇలా..

శ్రీవారి క్షేత్రంలో చాతుర్మాస (108 రోజుల) దీక్ష, 7 శనివారాల వ్రత దీక్ష, మండల (41 రోజులు) దీక్ష, అర్ధమండల (21 రోజులు) దీక్షగా భక్తులు స్వీకరిస్తున్నారు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో అనుకున్న సమయానికి మాల ధరించలేని భక్తులు 11 అలాగే 9 రోజుల దీక్షను చేపడతారు.

దీక్షాధారుల నిత్య కార్యక్రమాలు

తెల్లవారుజామునే చన్నీటి స్నానాన్ని ఆచరించి, పసుపు వర్ణ దుస్తులతో ఆలయానికి చేరుకుంటారు. ఆ తరువాత స్వామివారి దీపారాధన మండపంలో స్వాములంతా దీపాలు వెలిగించి, పూజాధికాలు జరుపుతారు. ఆ తరువాత గోవిందనామాలు చదువుతూ తమ భక్తిని చాటుతారు. అనంతరం ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి, ఉదయం 6 గంటల సమయానికి చినవెంకన్నకు ఇచ్చే తొలి హారతిని చూసేందుకు క్యూకడతారు. అదే విధంగా సాయంత్రం సూర్యాస్తమయం తరువాత గోవింద స్వాములు ఆలయంలో పూజలు చేస్తారు.

ప్రతి ఏటా దీక్ష చేపడుతున్నా..



గోవింద మాలను స్వీకరించే భక్తులకు స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉంటాయి. ప్రతి ఏటా నేను స్వామివారి దీక్షను స్వీకరిస్తున్నాను. కోరిన కోర్కెలు తీర్చే చినవెంకన్న దీక్షను చేపట్టే భక్తులు నానాటికి పెరుగుతున్నారు. దేవస్థానం వారు ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీవారి దర్శన భాగ్యంతో పాటు, మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

– అందుగుల రాములు, గురుస్వామి

నియమ నిష్టలతో ఆచరించాలి



గోవింద దీక్షాధారులు నియమాలను ఎంతో నిష్టగా ఆచరించాలి. అలా చేస్తే సకల శుభాలు కలుగుతాయి. శ్రీవారి కృపా కటాక్షాలు మన కుటుంబంపై ఎప్పుడూ ఉంటాయి. అర్ధ మండల దీక్షను చేపట్టలేనివారు ముక్కోటి ఏకాదశి పర్వదినానికి 11 రోజుల ముందు ఈ దీక్షను చేపట్టవచ్చు. వచ్చేనెల 10న ముక్కోటి నాడు దీక్షా విరమణ జరుగుతుంది.

– మిడత ఆంజనేయులు, గురుస్వామి

మా నాన్నతో కలసి దీక్ష చేపట్టా



మా నాన్నతో కలసి దీక్ష చేపట్టా. గురువారం తెల్లవారుజామున నిద్రలేచి, చన్నీటి స్నానం చేసి, ఆలయానికి వచ్చి దీక్షను స్వీకరించాను. నా తోటిపిల్లలు మరికొంతమంది ఈ దీక్షను చేపట్టారు. గోవింద మాల వేసుకోవడం వల్ల అంతా మంచి జరుగుతుందని చెప్పారు. అందరితో కలసి దీక్షను పూర్తి చేస్తాను.

– కానూరి కూనల్, గోవింద దీక్షాధారుడు

అరకొర వైద్యంతో అవస్థలు

- వేధిస్తున్న వైద్యుల కొరత
- స్కానింగ్ సేవలు నిల్
- పూర్తిస్థాయిలో లేని సదరం క్యాంపులు
- ఇదీ భీమవరం ప్రభుత్వాసుపత్రి దుస్థితి



భీమవరంలోని ఏరియా ప్రభుత్వాసుపత్రి, స్కానింగ్ సెంటర్‌కు వేసి ఉన్న తాళం (అంతర్‌చిత్రం)

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కేంద్రం భీమవరంలోని ప్రభుత్వాసుపత్రిలో అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య నిపుణులు (స్పెషలిస్టులు) అందుబాటులో లేకపోవడంతో వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న ఈ ఆసుపత్రికి సాధారణ రోజుల్లో 300 నుంచి 400 మంది, సీజనల్ కాలంలో రోజుకు 400 నుంచి 500 మంది ఓపీ రోగులు వస్తుంటారు. అలాగే ఇన్‌పేషెంట్లుగా రోజుకు 20 నుంచి 30 వరకూ ఉంటారు. నెలకు డెలివరీ కేసులు 100 వరకూ ఉంటున్నాయి. జిల్లాలోని నర్సాపురం, పాలకొల్లు, ఉండి, కృష్ణా జిల్లా తీర ప్రాంత ప్రజలు కూడా భీమవరంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పొందుతారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత, సౌకర్యాల కొరత వేధిస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్పెషలిస్టుల కొరతతో ఇబ్బందులు

భీమవరం ప్రభుత్వాసుపత్రిలో స్పెషలిస్టు వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఈ ఆసుపత్రికి సంబంధించి సీఎస్‌ఆర్‌ఎం, సివిల్ సర్జన్, జనరల్ సర్జన్, సివిల్ సర్జన్ జనరల్ మెడిసిన్, డెర్మటాలజిస్ట్ తదితర స్పెషలిస్ట్ వైద్యులు లేరు. అలాగే సుమారు 10 మంది వరకూ వైద్య సిబ్బంది కొరత కూడా ఉంది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆయా వ్యాధులకు సంబంధించి వైద్యం అందడం లేదు. చేసేది లేక వారు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసి వైద్యం పొందాల్సిన పరిస్థితి.

స్కానింగ్ సేవలు నిల్

భీమవరం ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్‌కు రేడియాలజిస్ట్ (డాక్టర్) లేకపోవడంతో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. గత ఆరు నెలలుగా ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్ నిరుపయోగంగా ఉంది. ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, ఇతర వ్యాధులకు సంబంధించి వైద్యులు స్కానింగ్‌కు సిఫార్సు చేస్తే పట్టణంలోని ప్రైవేట్ ల్యాబ్‌ల్లో వేల రూపాయాలు ఖర్చు చేసి స్కానింగ్ చేసుకోవాల్సి వస్తుంది. దీంతో పేద, మధ్యతరగతి వారికి స్కానింగ్ ఖర్చు చాలా భారంగా ఉంది.

పూర్తిస్థాయిలో సదరం క్యాంపులు లేవు

ఈ ప్రభుత్వాసుపత్రిలో పూర్తిస్థాయిలో సదరం క్యాంపుల సౌకర్యం లేదు. ఇక్కడ కేవలం ఎముకలకు మాత్రమే సంబంధించి సదరం క్యాంపు నిర్వహిస్తున్నారు. కంటి, చెవి, ఇతర వ్యాధులకు సంబంధించి సదరం క్యాంపులు భీమవరం ఆసుపత్రిలో అందుబాటులో లేవు. దీంతో జిల్లా ఆసుపత్రి తణుకు, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రులకు భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, ఉండి నియోజకవర్గ ప్రాంత ప్రజలు వెళ్తున్నారు. దాదాపు 30 నుంచి 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సదరం క్యాంపులకు చేరుకోవడంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమిస్తే ప్రజలకు అటు పూర్తిస్థాయిలో వైద్య సేవలు, ఇటు అన్ని రకాల సదరం క్యాంపులు స్థానికంగానే లభించే అవకాశం ఉంటుంది.

సంతానం కలుగలేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: సంతానం కలుగలేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఒక యువకుడు పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం బూరాయిగూడానికి చెందిన కాటి కిషోర్ (25)కు మౌనికతో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. వీరు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి సంతానం కలుగకపోవడంతో మానసికంగా బాధపడుతున్న కిషోర్ ఈనెల 17వ తేదీన పురుగుమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యులు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్సై సీహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత



తణుకులో ఇంధన పొదుపు వారోత్సవాల్లో డీఈఈ శ్రీనివాస్, ఉద్యోగులు, విద్యార్థులు

తణుకు అర్బన్: ఇంధన పొదుపును ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ పి.శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తణుకు విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం విద్యుత్ పొదుపుపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం విద్యుత్ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల, భాష్యం స్కూలు విద్యార్థులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సమన్వయం కావాలి



మహిళా సమాఖ్య భవనంలో అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న సర్పంచ్‌లు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, అధికారులు సమన్వయం కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హులకు అందేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఆరుగొలను సర్పంచ్‌లు పీతల బుచ్చిబాబు, ఉండ్రాజవరపు చంద్రిక, తాడేపల్లి బేబీ, ఆరుగొల్లు శ్రీనివాస్, కూడవల్లి హనుమంతరావు, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



తణుకులో పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: విద్యాభ్యాసంలో పదో తరగతి కీలక మలుపని, ఇష్టంగా చదివితే విద్య కష్టంగా ఉండదని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి.దక్షిణామూర్తి అన్నారు. గురువారం స్థానిక అమరవీరుల భవనంలో కేంద్రం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు, సమాధానాలతో కూడిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి ఉపయోగపడే ప్రతి విద్యాసామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యను ప్రోత్సహించే క్రమంలో వచ్చే నెలలో బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని, కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణలతో పాటు న్యాయ సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సభ్యులు శేషుబాబు, కామన మునిస్వామి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాధనే విజయానికి మార్గం

తాడేపల్లిగూడెం: నిరంతర సాధనే లక్ష్యఛేదనకు రాజమార్గమని ఏపీ నిట్ అసోసియేట్ డీన్ వి.సందీప్ చెప్పారు. ఏలూరు ఎస్ఆర్ఐ కళాశాలకు చెందిన విద్యార్థులకు నిట్‌లో గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. విభిన్నమైన ఆలోచనలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలన్నారు. విద్యార్థులు వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవాలన్నారు. కలలు కంటూ వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.

సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా సుపరిపాలన సాధ్యం

ఇరగవరం: సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా గ్రామాల్లో సుపరిపాలన సుసాధ్యమవుతుందని మండల ప్రత్యేకాధికారి ఏ.శ్రీనివాస్ తెలిపారు. ఇరగవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించే సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ పంచాయతీ పరిపాలనపై పట్టు సాధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సృష్టించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. పంచాయతీలు తమకు రావాల్సిన ప్రతి ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణ పనులపై వివాదం

- కొన్ని క్రీడలకే పరిమితం చేస్తున్నారనే ఆరోపణలు
- రూ. 5 లక్షల పీఎం శ్రీ నిధులతో పనులు ప్రారంభం
- గతంలోనూ ఇదే తరహాలో నిర్మాణం చేశారంటున్న వైనం
- ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్





తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ట్రాక్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రన్నింగ్ ట్రాక్ పనులు వివాదాస్పదంగా మారాయి. తణుకు నియోజకవర్గంలో ఎక్కడా లేని క్రీడా ప్రాంగణ సదుపాయం తణుకు పాఠశాలలో మాత్రమే ఉందని ఇప్పుడు ట్రాక్ తదితర పనుల కారణంగా క్రీడా ప్రాంగణం కొన్ని క్రీడలకు మాత్రమే పరిమితమవుతుందంటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటికే ఈ క్రీడా ప్రాంగణం కొంతమేర అన్యాక్రాంతానికి గురైందని, మిగిలిన స్థలాన్ని కూడా పూర్తిస్థాయిలో వినియోగించకుండా ఇలా నిర్మాణాలు చేసేస్తారా అని పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తణుకువాసుల నుంచి వ్యతిరేకత రావడమో మరే ఇతర కారణాలతోనో కానీ గురువారం మధ్యాహ్నం హడావుడిగా పనులను నిలిపివేశారు.

రూ. 5 లక్షల నిధులతో పనులు ప్రారంభం

పీఎం శ్రీ పథకం నిధులు రూ. 5 లక్షలతో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రన్నింగ్ ట్రాక్‌తోపాటు కొన్ని రకాల క్రీడా పోటీలకు అనువుగా నిర్మాణాలు చేసే పనులు ఇటీవలే ప్రారంభించారు. దాతలు అందించిన ఇంత విశాలమైన క్రీడా ప్రాంగణం కొన్ని క్రీడలకే పరిమితం చేసేలా చేసి పాడుచేస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా క్రీడా ప్రాంగణం పూర్తిగా కాకుండా మధ్యలో కొంతమేర మాత్రమే ట్రాక్ పనులు చేయడం వలన మిగిలిన ప్రాంతం ఎటూకాకుండా పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఇదే క్రీడా ప్రాంగణం ముఖద్వారం ప్రాంతంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం కూడా ఇలాంటి వివాదాల మధ్యే నిర్మాణం పూర్తయ్యింది. అప్పట్లో కూడా ఇండోర్ స్టేడియం నిర్మాణం కారణంగా క్రీడా ప్రాంగణం కుదించుకుపోతుందని ఈ నిర్మాణాన్ని దూరంగా తరలించాలనే వాదనలు పూర్వ విద్యార్థులు, తణుకు వాసుల నుంచి వెల్లడైంది. ఈ విషయంపై ఎంఈవో వి.హైమావతిని సాక్షి వివరణ కోరగా క్రీడాప్రాంగణంలో పీఎంశ్రీ నిధులతో రన్నింగ్ ట్రాక్, వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులు తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయని అన్నారు. దీనిపై ఎటువంటి అభ్యంతరాలు నాదృష్టికి రాలేదని అన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



అరిగెల అభిషేక్‌ను అభినందిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం అర్బన్: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు లభిస్తుందనడానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల నియామకమే నిదర్శనమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం స్టూడెంట్ వింగ్ అధ్యక్షునిగా అరిగెల అభిషేక్, లీగల్ సెల్ ప్రెసిడెంట్‌గా అద్దంకి విజయరత్నంలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అరిగెల అభిషేక్‌ను మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు.

అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పొట్ల సురేష్, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా కాశీరెడ్డి బాల లక్ష్మీనారాయణ, జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షుడిగా బుడితి సుజన్‌కుమార్, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా జల్లూరి జగదీష్‌కుమార్‌లను నియమించారు.

21న వాసవి జీఎంఆర్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ లిమిటెడ్‌లో ఫార్మసిస్టులు, ముత్తూట్ మైక్రో ఫిన్ కంపెనీలో రిలేషన్ ఆఫీస్, భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లిమిటెడ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ వంటి విభాగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18–30 సంవత్సరాలు వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని తెలిపారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం



తణుకులో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఏ నాయకులు

తణుకు అర్బన్: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి. అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ జాతీయ సమితి పిలుపులో భాగంగా గురువారం స్థానిక వెంకటేశ్వర సెంటర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, భారతదేశ రాజ్యాంగాన్ని రచించడంలో కీలక పాత్ర పోషించిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అశేష కృషి చేసిన వ్యక్తిపట్ల ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణం నరేంద్ర మోదీ స్పందించాలని, లేదంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు యు.మురళి, జి. దుర్గాప్రసాద్, డి గుణశేఖర్, ఎస్ రాహుల్, జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో దళిత నాయకుల నిరసన

అత్తిలి: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని పార్లమెంట్ సాక్షిగా అవహేళన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ అత్తిలి మండల దళిత నాయకులు గురువారం బస్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగాన్ని అనుసరించి మంత్రి పదవులు చేపట్టి ఈరోజున అంబేడ్కర్‌ని అవహేళన చేయడం తగదని, అంబేడ్కర్ ఖ్యాతిని అనేక దేశాలలో కీర్తిస్తుంటే, మనదేశంలో వ్యంగ్యంగా మాట్లాడటం సిగ్గుచేటని, ఇది యావత్తు భారతజాతికి జరిగిన అవమానం అని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఏఐడీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బట్టు నాగరాజు, కేవీపీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, దళిత ఐక్యవేదిక అత్తిలి మండల అధ్యక్షుడు పానుగు వినయ్ బాబు, కోరుకొల్లు వెంకట్రావు, ఈడూరు రాంబాబు, బుడితి సుజన్‌కుమార్, యాళ్లస్వామి, నూకపెయ్యి రామకృష్ణ, బుంగా పద్మారావు, చేకూరి చంద్రరావు, ఇంజే రమేష్, తాటిపాక మధు, మరపట్ల అబ్రహం, మరపట్ల చిట్టిబాబు, కాకర్ల రేగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



తణుకు మాట్లాడుతున్న గణిత అవధాని మూర్తి

తణుకు అర్బన్: తణుకు రూట్స్ స్కూల్‌లో గురువారం గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గణిత అవధాని టీఎస్‌వీఎస్ మూర్తి మాట్లాడుతూ అవధానం సాహిత్య సంబంధమైన ప్రక్రియ అయినప్పటికీ గణిత అవధానం విద్యార్థుల్లో గణితం పట్ల మక్కువను పెంచేందుకు దోహదపడుతుందన్నారు. మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో జాతీయస్థాయిలో మొదటి, జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. సంస్థ డైరెక్టర్‌లు ఎస్. సుధాకర్‌వర్మ, ఎల్‌కే త్రిపాఠి తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తణుకు టౌన్: వేమవరంలో రెవెన్యూ సదస్సులో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ అశోక్ వర్మ



తాడేపల్లిగూడెం రూరల్: కడియద్ద గ్రామంలో ఫారం-బి ధ్రువపత్రాలను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ చెప్పారు. గురువారం తణుకులోని టీ వేమవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సులో 4 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడ నివాసం ఉండే యానాదులకు 5 కుటుంబాలకు ఆధార్ నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయ, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కడియద్ద..నీలాద్రిపురంలో రెవెన్యూ సదస్సులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద, నీలాద్రిపురం, కృష్ణాపురం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు తమ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామ నాయకులు పాకనాటి తాతాజీ, వీఆర్వో ఆదాము రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



తణుకులో అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యవహారంపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు బైపాస్ రోడ్డులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు పట్టణానికి చెందిన పెద్దేటి రాకేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాస్, సిబ్బంది దేవి పాల్గొన్నారు.

పెంటపాడులో ఎక్సైజ్ దాడులు

పెంటపాడు: మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని సీఐ స్వర్ణలత తెలిపారు. అతని వద్ద నుంచి 6మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులలో సబ్ ఇనస్పెక్టర్ మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు



తాడేపల్లిగూడెంలో మాసోత్సవాలు పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్టీసీ డీఎం, తదితరులు

తణుకు అర్బన్: నేటి నుంచి వచ్చేనెల 19వ తేదీ వరకు తణుకు ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో 80 ముఖ్యమైన పట్టణాల్లో ఈ డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందని 50 కేజీల బరువు వరకు 10 కిలోమీటర్ల పట్టణ పరిధిలో ఈ సౌకర్యం కలదని అన్నారు. ఈ డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా డోర్ డెలివరీ బుకింగ్‌లు చేసుకునే కస్టమర్స్ యొక్క ఎల్ఆర్‌లు ప్రతి వారం లక్కీ డిప్ తీసి ప్రతి వారం ముగ్గురికి ప్రథమ బహుమతులు, ముగ్గురికి ద్వితీయ బహుమతులతోపాటు జనవరి 20న బంపర్ డ్రా నిర్వహించి ముగ్గురికి పట్టు చీరలు, ముగ్గురికి ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతులను తణుకు నరేష్ క్లాత్ షోరూం, ద్వితీయ బహుమతులను షాలేం పెన్ కార్నర్ యాజమాన్యాలు అందిస్తున్నారని తణుకు కార్గో వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ కార్గో విభాగం డోర్ డెలివరీ మాసోత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, డీఎంఈ మాధవరావులు వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు విడుదల చేశారు. డీఎం మాట్లాడుతూ వినియోగదారులకు, బ్యాంక్ అధికారులు, వ్యాపారస్తులు, విద్యా సంస్థలు, ఇతర విభాగాలు వారికి డోర్ డెలివరి సౌకర్యంపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత సంవత్సరం విశేష ఆదరణ లభించి, డోర్ డెలివరీ చేయడంలో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని వివరించారు.

దోమపుట్టుకను అరికట్టాలి



తణుకులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహం సక్రమంగా లేకపోతే దోమ పుట్టుకకు మార్గమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 30వ వార్డు రెల్వే ట్రాక్ ప్రాంతంలో వెక్టార్ కంట్రోల్ హైజీన్, కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. ప్రజలు చెత్తను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని, డ్రెయిన్లలో పారవేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ చెత్తను మునిసిపల్ చెత్త సేకరణ సిబ్బంది అందజేయాలని కోరారు. జ్వరం లక్షణాలు ఉన్న వారంతా అర్బన్ హెల్త్ సెంటర్స్, ప్రభుత్వ ఆస్పత్రికిగానీ వెళ్లాలే కానీ సొంత వైద్యం మంచిదికాదని చెప్పారు. ఈ సందర్భంగా వ్యాధులకు సంబంధించిన వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ కె.అనుష సువర్ణ, ఆశా కార్యకర్త ఎస్. కుమారి పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన కాలనీల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీని గురువారం హౌసింగ్ పీడీ వై. హరిహరనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి బిల్లులు, మెటీరియల్ సమృద్ధిగా ఉన్నాయని, లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ఈఈ బి.వెంకటరమణ, డీఈ కేవీఎస్.ప్రసాద్, ఏఈ వైవి.వెంకట్రావు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

అత్తిలి: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్లీ ఏబుల్డ్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నూతన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటితో ముగియనుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. నూతన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఏసీఏ గౌరవ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు శుక్రవారంలోపుగా తమపేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న దివ్యాంగ క్రీడాకారుల ఎంపిక తేదీని శనివారం ప్రకటిస్తామని తెలిపారు. వివరాల కోసం కన్వీనర్ దాసందుర్గారావు సెల్ నెంబర్ 90141 44440 ను సంప్రదించాలని చెప్పారు.

పాస్‌పోర్టు పోయినది

పాలవంచ తిరుమల వెంకట శ్రీనివాస్ S/o రమణాచార్యులు అను నేను తాడేపల్లిగూడెం నివాసిని. నాకు పాస్‌పోర్ట్ కలదు. నా పాస్‌పోర్ట్ నెం.L4032263. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ తీయించుటకు తాలూకా ఆఫీస్ సెంటర్‌కు వెళ్ళుచుండగా పడిపోయినది. దొరికినవారు దయతో 70936 60977 అను నెంబర్‌కు తెలుపగలరు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తణుకులో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ (ఐఎఫ్‌టీ) మిషన్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ టీ రామబ్రహ్మం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, కార్యదర్శి స్వాలిహా, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, భారతి రాధాకృష్ణ, వీ పార్వతి, ఎస్ రామకృష్ణారావు, అరవ శ్రీనివాస్, జీ నాగేశ్వరరావు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలు విశ్వవ్యాప్తం

పెంటపాడు: యేసు బోధనలు విశ్వవ్యాప్తం వ్యాపించాయని రాజమండ్రికి చెందిన అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ జాన్‌వెస్లీ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు చింతలంక ప్రాంతంలో క్రైస్ట్‌వర్షిప్ నూతన మందిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుకు విధేయులుగా జీవించేవారిలో ఆయన కృప మెండుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడెం ప్రాంతానికి చెందిన పలువురు సంఘ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్‌రోడ్డు, రైల్వే ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20వ తేదీన శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, నల్లజర్ల రోడ్డు, మెయిన్ రోడ్డు, శేషమహల్ సెంటర్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, కోతిబొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు, భూపాల్ నగర్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.నరసింహమూర్తి తెలిపారు. కుంచనపల్లి, ఎల్. అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు

అత్తిలి: కులంపేరుతో దూషించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి ప్రేమరాజు గురువారం తెలిపారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన నీతిపూడి శ్రీనివాస్, అర్తపాక పాపారావు ఈనెల 16న పాలూరు నుంచి వస్తుండగా వెల్డింగ్‌షాపు వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గొడవపడటం చూసి ఆగి వెళ్లిన సందర్భంలో వారు నీతిపూడి శ్రీనివాస్, పాపారావులను కులం పేరుతో దూషించినట్లు వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని, దీనిపై ఉరదాళ్లపాలెం గ్రామానికి చెందిన గుండుమోగుల వీర్రాజు, గుండుమోగుల ఉమామహేశ్వరరావు, కోపల్లి పూర్ణారావు, కోపల్లి తాతయ్య, కోపల్లె ధనరాజులపై ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రేమరాజు చెప్పారు.